# "ఇమానంగ సెబుతున్న"

**నేం**బుట్టింది కన్నాగురం జిల్లా తెలుకుంటూల్లె. పెరిగింది గూడక్కన్నే... చదివింది మా ఊళ్ళె, ఎలిగేడ్ల కన్నాగురంల, ఒరంగల్లుల, పట్నంల కొద్దిగంత కలకత్తల గూడ జదివిన... నౌకరి సేసుకుంటగూడ సదువుతున్న.... సదువుకంతెక్కడిది....? నౌకరి సేత్తున్నది, గోదావరిఖని దగ్గెరున్న ఎస్పీఐల.

నేను ఇమానంగ[1] సెప్పుతన్న... అన్నంతోడు నేనన్నీ నిజాలే సెప్పన్ననుకుంటున్న. నేను సిన్నగున్నప్పుడవద్దమాడితె మా అవ్వ అవ్వతోడు పెట్టుకొని నిజం సెప్పుమనేది. నేనస్సలే అవ్వతోడని ఒట్టుపెట్టుకోకపొయ్యేటోన్ని. నేనవ్వతోడంటున్న నంటే గండ్ల అవద్దాలు లెవ్వన్నట్టే లెక్క.... అవ్వతోడు నేను నా రతునాల భూమి తెలంగాణ గురించి ఉన్నదున్నట్టు సెప్పుత. రజాకారు రాచసుల బాదలనుబగించిన గిక్కడి జనాలెట్ల బతుకుతంద్రో సెప్పుత. నైజాము సర్కారోని తుపాకులకు బొచ్చెనిచ్చి నిలుసున్న గిక్కడి బక్కోల్ల బతుకులెట్లున్నయో సెప్పుత. దొరలకు, జమీందార్లకెట్టి సేసి బతికిన గిక్కడి బాంచెగాల్ల బతుకులల్లున్న లోతుల గురించి సెప్పుత. ఈడి జెనాలేం దింటంద్రో, ఎట్లుండంద్రో సెప్పుత. ఇక్కడోల్ల ఆచారాల గురించి, పండుగల గురించి, పబ్బాల గురించి ఇడమర్సి సెప్పుత. వరుసలు పెట్టుకొని పిలుచుకునే ప్రేమలు, కడుపుల దాచుకునే మంచితనాలు, కుండలగలది తనకు లేకున్నా ఇంటికచ్చినోల్లకు పెట్టే దానగుణాల గురించి వివరంగ సెప్పుత. సత్తె పమానంగ ఇక్కడోల్ల కట్టాలు, సుకాలు అన్నిట్నీ గురించి అందరికి తెలిసేటట్టు సెప్పుత. ఇక్కడోల్ల రేసం, పట్టుదల, గొర్రెలసొంటి తెలువన్తం అన్నిట్నీ గురించి అవ్వల్దర్జగ[2] సెప్పుత.

పక్కబొక్కలెల్లిన బక్కోల్లు, తెల్లందాక పొద్దందాక కట్టపడ్డా కడుపన్ననాడని పేదోల్ల బతుకులు, ఆల్ల కడుపులున్న సొద, మనుసులున్న వెతల గురించి తెలుగోల్లందరికి తెల్లగోలుగ[3] తెలుసెటట్టు సెప్పుత. అయ్య బాంచె నవ్వబాంచెనని బతికిన నా తెలంగాణోల్ల గురించి, రజాకార్ల ముంగట బట్టలిడిసి బతుకమ్మాడిన తెలంగానక్కల గురించి, రెక్కల కట్టంతోని బతుకుతున్న నా నడిగడ్డ తెలుగోల్ల గురించి మి అందరికి మనుసుల కెక్కేటట్టు చెప్పుత.

అయితే నేనేం కైగట్టి సెప్పుతనంటలేను. గోల్‌మాల్ జేసిగూడ సెప్ప. తీరుతీరు రంగేసి అస్సలె సెప్ప. చిన్నప్పట్నుంచి అంటే నేనేలెడంతున్నప్పట్నుంచి నేం జూసినయి, నా కండ్లముందట జరిగినయి, నా సెప్పులతో విన్నయి, నా ఆలోచన్లకచ్చిన వాట్నిగురించే రాత్త. నాకు తెలవందొక్క సంగతి గూడ సెప్పనంటే సెప్ప. గంతేకాదుమల్ల. నేం జెప్పేటియన్ని గూడ అల్లబాసల్నే. అల్లమాటలల్లనే, అల్లయాసల్నే సెప్పుత. ఇక్కడోల్ల గురించి తెలువన్నంటే వీట్ని మనుసు వెట్టి సదువాలె. ఎవ్వల కష్టాలయిన కొంచెమెక్కో తక్కో ఒక్కటే. మరాల్ల గురించి అల్ల బాసల సెప్పితేనే మంచిగుంటది. ఒకర్నొకరు అరుతం సేసుకోవచ్చు. గందుకే గివ్వన్ని పేజీలు మార్చేసి సదువకుండా పట్టింపుతోని సదువాలె.

ఒక్కమాట. కారప్పూస కరకరలాడన్నంటే ఏం జేత్తం? శెనగపిండిల కొంచెమంత బియ్యప్పిండి కలుపుతమా? లేదా? మరి గిది మనుసులుంచుకోండ్రి. మల్లో పారవ్వతోడని పమానం జేసి నూటికి తొంభైకంటెక్కువే నిజాలు సెప్పుతనంటున్న. నేం జెప్పే సంగతుల గురించి మంచిగ సదువుండ్రి మరి. శాత్రాలు,శాత్రాలుగనే సెప్పుతన్నగని గివ్వి నువ్వద్ది' శాత్రాలు.

☆ ☆ ☆